హారర్ స్టోరీ

# రుజువు

- లయ



గొంతు బలహీనంగా వుంది. అలసిపోయాడు. అతి ప్రయత్నం మీద మాటలు పలకగలుగుతున్నాడు. "జబ్బుపడి యింకా కోలుకోలేదు కాబోలు" అనుకున్నారు శ్రోతలు. ఒకవైపు అతణ్ణి చూస్తే జాలి వేస్తున్నది. మరోవైపు తమ సహనాన్ని పరీక్షిస్తున్నందుకు కోపంగా కూడా వుంది. అనేక సంవత్సరాల క్రితం, యువకుడిగా వున్నప్పుడు హిమాలయాలకు వెళ్లాడట. ఆ రోజులు నెమరు వేసుకుంటున్నాడు. ఆ ఎత్తులో వూపిరాడదు. అడుగు ముందుకెయ్యటం కూడా కష్టంగా వుంటుంది హాల్లో. అయిదడుగుల ఎత్తున్న వేదిక మీద ఆయన హిమాలయ పర్వత సానువుల్లో వున్నట్టుగా భ్రమపడుతున్నాడా ఏమిటి!

"ఆరోగ్యం అనుకూలించనప్పుడు వుపన్యాసానికి రావటమెందుకు. అందర్నీ యిబ్బంది పెట్టటమెందుకు" అనుకుంటూ పక్కనున్న అధ్యక్షుల వారు "నీళ్ల గ్లాసు ఆయన ముందుకు జరిపారు. ఆ హాలు శవపేటికలా చల్లగా వుంది. అస్తిపంజరం చేతి వేళ్లలా కిటికీల అద్దాల మీద మంచు పేరుకుపోయింది. వక్త ఎవరినుద్దేశించి మాట్లాడుతున్నాడు? తన అనుభవాల్ని, జ్ఞాపకాల్ని ఆసక్తికరంగా ప్రేక్షకులకు చెప్పాలి అనే స్పృహ వుందా అసలు. కొందరు ఆవలించారు. కొందరు పక్కవాళ్లతో కబుర్లలో పడ్డారు. కొందరు సీనియర్ మెంబర్లు మాత్రం మర్యాదకోసం వింటున్నట్టుగా నటించారు.

సైకికల్ సొసైటీ (మానసిక శక్తుల్ని, అద్భుతాల్ని అధ్యయనం చేసే కొందరు ఔత్సాహిక శాస్త్రజ్ఞుల బృందం) సమావేశం జరుగుతోందక్కడ. వారం రోజుల క్రితం ఆ సొసైటీ అధ్యక్షునికో లేఖ అందింది. వృద్ధాప్యం వల్లనో, తాగుడు వల్లనో వేళ్లు కలాన్ని పట్టుకోలేని దశలో రాసినట్టుగా వంకర టింకరగా వున్నాయి అక్షరాలు. అర్జెంటుగా, ఒక సమావేశం ఏర్పాటుచెయ్యాలని దాని సారాంశం. అక్కడ అందరి సమక్షంలో ఒక అద్భుతం జరుగుతుంది. అయితే, అదేమిటో అధ్యక్షునికీ అర్థం కాలేదు. దస్తూరి, జీవిత చరమాంకంలో వున్న తన మిత్రుడిని పోల్చుకో గలిగాడు. జీవితంలో ఏమీ సాధించలేని వాళ్లకు, వృద్ధాప్యంలో యిలాంటి కోరికలుండటం సహజమే. అయినా, సమావేశం ఏర్పాటు చెయ్యటానికి పెద్ద ప్రయత్నమక్కర్లేదు. పోస్టుకార్డులు రాసినా సరిపోతుంది.

అలాగ, అనేక సంవత్సరాల తర్వాత, వేదిక మీద మళ్లీ తన పాత మిత్రుడికి ఆహ్వానం పలికాడు అధ్యక్షుడు. తామిద్దరూ కలుసుకుని పదేళ్లయిందో, యింకా ఎక్కువో గుర్తులేదు. చర్మం ముడతలు పడింది. కళ్లు పీక్కుపోయాయి. మొహం మీద ఎముకలు కనిపిస్తున్నాయి. ఈ ముసలితనంలో అదేమికోరికో ఘాటైన సెంటు రాసుకున్నాడు. సాంబ్రాణి, గుగ్గిలం పొగ వేసినట్టుగా వాసనొస్తున్నది. వేదికకు దగ్గరగా కూర్చున్న స్త్రీలు జేబురుమాళ్లతో ముక్కులు మూసుకున్నారు. మగాళ్లు సిగార్లు వెలిగించారు. శ్రోతల అనాసక్తతను వక్త గ్రహించినట్టే ఉంది. "నా కసలే గొంతు బాగా లేదు. ఇబ్బందిగా మాట్లాడుతున్నాను. సిగారు పొగ నాకు పడదు. ప్లీజ్" అంటూ వేడుకున్నాను. "అవునండీ. వాతావరణం కూడా బాగాలేదు. ఇవి ఇన్‌ఫ్లుయెంజా సీజన్" అంటూ సర్ది చెప్పాడు అధ్యక్షుడు.

"కావచ్చు. నేను కాన్సర్‌తో బాధ పడుతున్నాను" అన్నాడు వక్త.

శ్రోతలు ఒక్కసారిగా వులిక్కిపడ్డారు. మరి, ఈ పరిస్థితిలో యితనిక్కడికొచ్చి ఉపన్యసించనేల హాల్లో గుసగుసలు ప్రారంభమయ్యాయి. ఎవరేమనుకుంటే నాకేమన్నట్టుగా, తన ధోరణిలో వుపన్యాసం కొనసాగించాడు వక్త. ఒకసారి అరుస్తున్నట్టుగా, మరొకసారి కీచుగొంతుతో లేదా మాటల్ని వుచ్ఛరించే ఓపిక కూడా లేనట్టుగా, వూపిరాగిపోతుందేమోనన్నట్టుగా, అస్పష్టంగా మాట్లాడాడు. "నాకీఅవకాశమిచ్చిన సొసైటీ నిర్వాహకులకు, ఓపికగా వింటున్న శ్రోతలకు కృతజ్ఞతలు. మీ ముందర నిల్చున్నందుకు ఆనందంగా వుంది. ఈనాటి నా మాటలు జీవితంలో మీరెప్పుడూ మరిచిపోలేరు. ఇంతకూ, ఇప్పుడు నేను మాట్లాడుతున్నవి శరీరానికీ, ఆత్మకు వున్న సంబంధం గురించి. శరీరం గురించి అందరికీ తెలుసు. కాని ఆత్మకు మరణం లేదు".

"సోది!" అంటూ అసహనంగా, నిష్క్రమించటానికి ప్రయత్నించారు కొందరు.

"మన బుద్ధి, రక్తప్రసరణ, నాడీ మండలం - ఒక్కటేమిటి శరీర నిర్మాణం ఎంత సంక్లిష్టంగా కనిపించినా, యిది కేవలం ఆత్మకు అతిథి గృహం వంటిదే" అంటూ పైన వెలుగుతున్న ఎలక్ట్రిక్ బల్బును గాజుకళ్లతో పరికించాడు వక్త. చాలా విషయాలు సుదీర్ఘంగా చర్చించటానికి సిద్ధపడి

నట్లే కనిపించాడు. కాని క్షణక్షణానికీ గొంతు బలహీన పడింది. నిలుచోవటం కూడా కష్టంగానే వున్నట్లుంది. శ్రోతలను గమనిస్తున్నట్టే లేదు. వెనక సీట్లో కూర్చున్న ఒక మధ్య వయస్కురాలు. ఏవో డిజైన్లు అల్లటం ప్రారంభించింది.

"నేను చాలా ముఖ్యమైన విషయం మాట్లాడుతున్నాను. ఇటువంటి అవకాశం మీకు మళ్ళీ రాక పోవచ్చు. నా మాటల్ని జాగ్రత్తగా ఆలకించండి. అర్థం చేసుకోవటానికి ప్రయత్నించండి" అంటూ పొడిపొడిగా పలకలేక పోతున్నాడు. మరి కాసేపటికి వుపన్యాసంలో హేతుబద్ధత కూడా లోపించింది. ప్రపంచ సాహిత్యం గురించి, షేక్స్పియర్ గురించి, హిమాలయాలలో రుషుల గురించి వాళ్ల అలౌకిక అనుభవాల గురించి తలాతోకా లేకుండా మాట్లాడాడు. ఒకసారి సిమ్లా గురించి మరోసారి టిబెట్ గురించి మరొకసారి అశరీర శక్తుల గురించి ఎందుకలా మాట్లాడింది. ఎవరికీ ఏమీ అర్థం కావడం లేదు.





వృద్ధుడు నోటికి వచ్చింది వాగుతున్నాడు. "శరీరం మరణిస్తుంది కాని ఆత్మ శాశ్వతం. ఆత్మ వున్నంత వరకే శరీరంలో కదలిక వుంటుంది. అర్థమైందా..." అంటున్నాడు.

తన మిత్రుని అవస్థ చూసి అధ్యక్షునికి జాలేసింది. ఎందుకూ అందరి ముందూ నవ్వుల పాలు కావటం! ఎవరి నమ్మకం వాళ్లది. తన అభిప్రాయం యితర్ల మీద రుద్దటానికి ఎందుకు ప్రయత్నిస్తున్నాడీ మతిస్థిమితం లేని వృద్ధుడు? అంతలో ఒక శ్రోత వద్ద నుండి ఒక నోట్ వచ్చింది.

"మా సహనాన్ని పరీక్షించకండి. ఇకనైనా ఆ ముసలాయన్ని కూర్చోబెట్టండి".

వాళ్లకే అలావుంటే, ఈ సమావేశం ఏర్పాటు చేసిన తను వాళ్ల దృష్టిలో మరెంత చులకనయ్యాడో! కాని వక్త వాక్ప్రవాహం ఆగలేదు. పైగా ముక్కుపుటాలు బద్దలయ్యే దుర్వాసన. కొన్నిసార్లు తియ్యగా అది వెగటు పుట్టించే (కడుపులో చేయిపెట్టి కెలికినట్టుగా) కుళ్లిన వాసన. పాత మిత్రుడి ఇటీవల చరిత్ర తెలుసుకోక పోవటమే తాను చేసిన పెద్ద తప్పిదం.

"ఆత్మకు మరణం లేదని నిరూపించాలా?" అంటూ అరుస్తున్నాడు. రాయిమీద రాయితో గీస్తే వచ్చే చప్పుడు లాగుందా స్వరం. పాతకాగితం అతికించినట్టుగా ఎండిపోయిన మొహం. ఎక్కడా మాంసం కనిపించని అస్థిపంజరం లాంటి శరీరం. ప్రేక్షకులను మెప్పించాలంటే వక్తల మాటల్లో వుద్రేకం. కొంత అనునయం. ఒక ధార, ఒక లాజిక్ వుండాలి. కాని ఈయనలో అదేమీలేదు. వాక్యానికీ వాక్యానికీ సంబంధమే లేకుండా, "వినకపోతే మీ ఖర్మ కాదా వినగలగటం మీ అదృష్టం" అన్నంత ధీమాగా మాట్లాడుతున్నాడు. ఇంతకూ అతను స్పృహలో వున్నాడా? మరెవరైనా అతనితో మాట్లాడిస్తున్నారా?

ఎట్టకేలకు ఢామ్మని కుర్చీలో కూలబడ్డాడు వక్త. తల ఒకవైపు వాలిపోయింది. ఒక వృద్ధ శ్రోత కన్నీళ్లు పెట్టుకుంది. సమావేశానికి హాజరైన ఒక డాక్టరు గారు వచ్చి వక్తను పరీక్షించాడు. కాని అంతలోనే ఆయన ముఖకవళికలు మారాయి. చేతులు కంపించాయి. జేబురుమాలు ముక్కుకడ్డం పెట్టుకున్నాడు. ఇక ఆలస్యం చేస్తే సభికుల్లో కలకలం రేగుతుందని భయపడి, "సమావేశం ముగిసిందని ప్రకటించండి. ఈయన మరణించాడు" అన్నాడు అధ్యక్షునితో.

డాక్టరు చూసిన మొదటి మృత్యువేమీ కాదది. ఎంతమందిని, ఎన్ని పరిస్థితుల్లో చివరి శ్వాస వదలటం దగ్గరుండి గమనించాడో కాని ఈ వృద్ధుని కేసు అంతుపట్టకుండా వుంది. ఆత్మహత్యలు చేసుకున్న వాళ్లు, యుద్ధరంగంలో మరణించిన వాళ్లు, ప్రమాదాల్లో తలలు నుజ్జునుజ్జు అయిన వాళ్లు – ఎందర్నో చూశాడు. అందరికీ డెత్ సర్టిఫికేట్లు కూడా యిచ్చాడు. కాని ఈ శరీరం, మునిగి చనిపోయిన అనేక రోజుల తర్వాత సముద్రంలోంచి వెదికి తీసినట్టుగా వుంది. నీళ్లలో నానటం వల్ల మొహం మీది మాంసం చేపలు కొరికినట్టుగా వుంది.

"ఇతను మరణించి కనీసం వారం రోజులై వుంటుంది" అన్నాడు డాక్టరు.

*

(గ్రాహం గ్రీన్ కథ ఆధారంగా)